సాక్షి
మహబూబ్‌నగర్
సోమవారం ၊ 30 ၊ డిసెంబర్ ၊ 2024



భక్తిశ్రద్ధలతో గంధోత్సవం
జిల్లాకేంద్రంలో అబ్దుల్ ఖాదర్‌షా దర్గా గంధోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.
వివరాలు 9లో ▸



ప్రమాదాల మలుపులు
నవాబ్‌పేట– మహబూబ్‌నగర్ రోడ్డు మూల మలుపులతో ప్రమాదాలకు అడ్డాగా మారింది.
వివరాలు 9లో ▸

గరిష్టం/కనిష్టం
32.7 /14.4

వాతావరణం
ఉదయం, రాత్రివేళలో చలి తీవ్రత భారీగా పెరుగుతుంది. తెల్లవారుజామున మంచు కురుస్తుంది.


- హత్యలు, అత్యాచార ఘటనలూ అధికమే..
- గతేడాది కంటే పెరిగిన ఎఫ్ఐఆర్‌లు
- నేరాలు, చోరీల అదుపులో కనిపించని పురోగతి
- బహిర్గతం చేసిన 2024 క్రైం రౌండప్ నివేదిక

దోచేశారు..!

జిల్లాలో పగలు, రాత్రి తేడా లేకుండా చోరీలు

మహబూబ్‌నగర్ క్రైం: జిల్లాలో ఈ ఏడాది భారీ నేరాలు లేకపోయినా.. చోరీల రూపంలో ప్రజల సొమ్మును అప్పనంగా దోచేశారు. ఈసారి పట్టణ కేంద్రాలతోపాటు పల్లెల్లోనూ చోరీల సంఖ్య గణనీయంగా పెరిగింది. అయితే పోయిన సొమ్ము రికవరీలో ఆశించిన స్థాయిలో లేకపోవడంతో బాధితులకు భారీ నష్టాల్ని మిగిల్చింది. అలాగే గతేడాదితో పోల్చితే ఈసారి స్వల్పంగా ఎఫ్ఐఆర్‌లు పెరిగాయి. 2023లో జిల్లాలో 5,869 కేసులు నమోదు కాగా.. ఈ ఏడాది 5887 నమోదయ్యాయి. జిల్లా పోలీస్ శాఖ పరిధిలో నేరాలు, చోరీలు అదుపు చేయడంలో ఈ ఏడాది పురోగతి కనిపించలేదు. ఈ క్రమంలో 2024 ఏడాదికి సంబంధించిన క్రైం రౌండప్‌పై ఆదివారం ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నివేదికన ఎస్పీ జానకి వెల్లడించారు. జిల్లాలో మొత్తంగా 2023తో పోల్చితే చిన్నపాటి నేరాలు, సైబర్, చీటింగ్ వంటి మోసాల్లో గతేడాది కంటే గణనీయమైన పెరుగుదల నమోదవడం ఆందోళన కలిగించే అంశం.

జిల్లాలో నమోదైన ఎస్సీ, ఎస్టీ కేసులు	78
మహిళలపై జరిగిన దాడులు	468
ఆత్మహత్యలు	377
అదృశ్య కేసులు	586
పోక్సో కేసులు	112
పెండింగ్ నాన్ బెయిలబుల్ వారెంట్లు	296
కొత్తగా ఓపెన్ చేసిన రౌడీషీట్స్	3
బాధితులకు అప్పగించిన పోగొట్టుకున్న సెల్‌ఫోన్లు	1,056
పోలీస్ గ్రీవెన్స్‌లో స్వీకరించిన ఫిర్యాదులు	735
హత్యలు	30
రాబరీ	9
చోరీలు	495
కిడ్నాప్‌లు	74
వేధింపులు	454
అత్యాచారాలు	105
చీటింగ్స్	134
హత్యాయత్నాలు	23
ఇతర ఐపీసీ కేసులు	1,156



రివైండ్ 2024

పెరిగిన అఘాయిత్యాలు



జిల్లాలో ఈ ఏడాది మహిళలపై అఘాయిత్యాలు పెరిగాయి. బాలికలను ప్రేమ పేరుతో ట్రాప్ చేసి మోసం చేస్తున్న ఘటనలు అధికమయ్యాయి. వరకట్న కేసులతోపాటు వేధింపుల కేసులు రెట్టింపు అయ్యాయి. మహిళా పోలీస్ స్టేషన్‌లో గతేడాది కంటే ఈసారి అధిక మొత్తంలో ఫిర్యాదులు పెరిగాయి. మహిళల కోసం షీటీం బృందాలను సైతం ఏర్పాటు చేసినా పెద్దగా అడ్డుకట్ట వేయలేకపోయాయి.



5,887 కేసులు నమోదు

జిల్లాలో ఈ ఏడాది మొత్తం 5,887 కేసులు నమోదయ్యాయి. ఇందులో వన్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో 332, టూటౌన్‌లో 438, ఉమెన్ పీఎస్‌లో 130, మహబూబ్‌నగర్ రూరల్‌లో 844, కోయిలకొండలో 242, హన్వాడలో 255, నవాబ్‌పేటలో 310, మహమ్మదాబాద్‌లో 314, జడ్చర్ల టౌన్‌లో 913, భూత్పూర్‌లో 308, మూసాపేటలో 204, అడ్డాకులలో 226, దేవరకద్రలో 238, చిన్నచింతకుంటలో 218, బాలానగర్‌లో 301, రాజాపూర్‌లో 314, మిడ్జిల్‌లో 300 కేసులు నమోదయ్యాయి.

➩ గత రెండేళ్లతో పోలిస్తే ఇసుక అక్రమ రవాణా పెరిగిందని చెప్పవచ్చు. ఈసారి రెండింతలు అదనంగా ఇసుక అక్రమ రవాణా కేసులు నమోదు కావడం గమనార్హం.

పెరిగిన రోడ్డు ప్రమాదాలు..

జిల్లాలో ఈ ఏడాది రోడ్డు ప్రమాదాలు పెరగడంతోపాటు మరణాల సంఖ్య సైతం రెట్టింపు అయ్యింది. మృతి చెందిన వారిలో పురుషులు అధికంగా ఉండగా అందులోనూ యువత ఎక్కువగా ఉన్నారు. ఈ ఏడాది 257 రోడ్డు ప్రమాదాల్లో 273 మంది మృతిచెందగా.. 476 మంది తీవ్రంగా గాయపడ్డారు.



భూత్పూర్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో కారులో నుంచి మృతదేహాన్ని వెలికితీస్తున్న పోలీస్ సిబ్బంది (ఫైల్)

ఎస్పీ మార్పు

ఈ ఏడాది జరిగిన ఎంపీ ఎన్నికల తర్వాత ఎస్పీగా జానకి బాధ్యతలు తీసుకున్నారు. అప్పటి వరకు ఉన్న హర్షవర్ధన్‌ను బదిలీ చేస్తూ ఆమెకు బాధ్యతలు అప్పగించారు.

➩ ఈ ఏడాది జనవరి 3న ప్రస్తుత డీఐజీగా పనిచేస్తున్న ఎల్ఎస్ చౌహాన్‌ను రామగుండం కమిషనర్‌గా బదిలీ చేసి.. జోగులాంబ జోన్– 7 డీఐజీగా జోయల్ డేవిస్ నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. కానీ, కొత్త డీఐజీ రాకపోవడంతో ఎల్ఎస్ చౌహానే కొనసాగుతున్నారు.

తగ్గిపోతున్న రికవరీ..

జిల్లాలో గతేడాది కంటే ఈసారి చోరీలు పెరిగాయి. తాళాలు వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడుతున్నారు. ఈ ఏడాది జిల్లాలో చోరీలు గణనీయంగా పెరగగా.. సొమ్మును రికవరీ చేయడంలో మాత్రం పోలీసులు వెనుకంజలో ఉన్నారు. ఈ ఏడాది మొత్తం రూ.3,83,99,107 సొమ్ము అపహరణకు గురవగా.. రూ.1,05,20,810 రికవరీ చేసినట్లు పోలీసులు లెక్కల్లో చూపించారు. కానీ, క్షేత్రస్థాయిలో ఇంకా తక్కువగానే బాధితులకు అందినట్లు తెలుస్తోంది. ప్రధానంగా దొంగతనాల్లో ఎత్తుకువెళ్లిన మొత్తం సొమ్ము విలువను కేసుల్లో చూపించడం లేదు.

ప్రత్యేక బృందాలతో..

ఈ ఏడాది జరిగిన ఎంపీ ఎన్నికలను పోలీస్ శాఖ సమర్థవంతంగా నిర్వహించింది. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించిన 11 మందిపై కేసులు నమోదు చేశారు. ప్రత్యేకంగా చెక్‌పోస్టులు ఏర్పాటు చేయడంతోపాటు పోలీస్ బృందాల ద్వారా చేపట్టిన వాహనాల తనిఖీల్లో రూ.2,38,89,330 నగదు సీజ్ చేశారు. రూ.7,94,204 విలువైన పలు రకాల వస్తువులు స్వాధీనం చేసుకున్నారు.

➩ జిల్లాలో ఏడు గంజాయి కేసులు నమోదు చేసి 1.619 కిలోల ఎండు గంజాయి సీజ్ చేశారు. అలాగే 226 లిక్కర్ కేసులు నమోదు చేసి 20,149.37 లీటర్ల లిక్కర్ సీజ్ చేశారు. జిల్లాలో 943 మందిని బైండోవర్ చేయడంతోపాటు 628 మందికి నోటీసులు అందించారు.

ప్రత్యేక కార్యాచరణతో ముందుకు..

కొత్త ఏడాది 2025లో జిల్లాలో మహిళలపై జరుగుతున్న నేరాలను పూర్తిగా కట్టడి చేయడంతోపాటు పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలను తగ్గించడానికి ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తాం. జిల్లాలో ఎక్కువగా నమోదవుతున్న కేసులపై దృష్టిపెట్టడంతోపాటు రోడ్ మ్యాప్ ఏర్పాటు చేసుకుంటున్నాం. జాతీయ రహదారిపై జరుగుతున్న ప్రమాదాలను తగ్గిస్తాం. హెల్మెట్ వాడకంపై కూడా సరైన ప్రణాళికతో ముందుకెళ్తాం. పాలమూరును గంజాయి రహిత జిల్లాగా ప్రకటించడానికి పూర్తిస్థాయిలో మత్తు పదార్థాలు కట్టడి చేస్తాం. గంజాయి సరఫరా చేసే వారిపై కఠినంగా చర్యలు తీసుకుంటాం. నేరస్థులకు కోర్టులలో మరిన్ని శిక్షలు పడేలా దర్యాప్తు వేగవంతం చేస్తాం. సైబర్ నేరాల కట్టడి కోసం ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహిస్తాం. లీగల్ సర్వీస్ అథారిటీ సహాయంతో మహిళలపై జరుగుతున్న నేరాలు కట్టడితోపాటు వేధింపులకు అడ్డుకట్ట వేస్తాం. పోలీస్ సిబ్బంది సంక్షేమం కోసం నూతన సంవత్సరంలో కొత్త కార్యక్రమాలకు శ్రీకారం చుడతాం.

– జానకి, ఎస్పీ



క్రైం నివేదిక వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ జానకి, పక్కన ఏఎస్పీ, డీఎస్పీలు



తుది అంకానికి కబడ్డీ పోటీలు

వివరాలు 8లో ▶

- హోరాహోరీగా సాగుతున్న రాష్ట్రస్థాయి సీఎం కప్ టోర్నీ
- పురుషుల విభాగంలో సెమీస్‌కు నారాయణపేట, వనపర్తి, రంగారెడ్డి, నల్లగొండ జట్లు
- మహిళా విభాగంలో నల్లగొండ, హైదరాబాద్, రంగారెడ్డి, గద్వాల..
- నేటితో ముగియనున్న చాంపియన్‌షిప్

– మహబూబ్‌నగర్ క్రీడలు

రాష్ట్రంలో విద్యకు అధిక ప్రాధాన్యం



పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలో శ్రమదానం చేస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తుందని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలో శ్రమదానం చేశారు. అలాగే అక్కడి బాలుర వసతి గృహాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత పదేళ్ల బీఆర్ఎస్ హయాంలో విద్యావ్యవస్థను విస్మరించారని ఆరోపించారు. విద్యార్థులకు కావాల్సిన కనీస మౌలిక సదుపాయాలు కల్పించలేకపోయారని విమర్శించారు. తాము అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో 11 వేల ఉపాధ్యాయులను నియమించామని, హాస్టల్ విద్యార్థులకు 40 శాతం డైట్ చార్జీలు పెంచి వారికి బలవర్ధకమైన ఆహారం అందిస్తున్నామన్నారు. ముఖ్యంగా మహబూబ్‌నగర్‌ను ఎడ్యుకేషనల్ హబ్‌గా అభివృద్ధి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, వైస్ చైర్మన్ షబ్బీర్‌అహ్మద్, ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, కౌన్సిలర్లు నర్సింహులు, ఉమర్‌పాషా, మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్ రెడ్డి, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ మోహన్ బాబు, వార్డెన్ గోవర్ధన్ పాల్గొన్నారు.

మహిళా సంక్షేమానికి కృషి

స్టేషన్ మహబూబ్‌నగర్: మహిళా సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం మహబూబ్‌నగర్ అర్బన్ మండలానికి చెందిన 35 మందికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజాప్రభుత్వం ఏర్పడిన వెంటనే మహిళా సంక్షేమానికి ఎన్నో పథకాలు అమలు చేస్తుందన్నారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్ అందజేస్తున్నామన్నారు. త్వరలోనే ఇందిరమ్మ ఇళ్లు కూడా మహిళల పేరుపైనే మంజూరు చేస్తామన్నారు.

న్యూస్‌రీల్

తగ్గిన వరి ధాన్యం రాక



నవాబ్‌పేట: స్థానిక మార్కెట్‌కు ధాన్యం రాక తగ్గిపోయింది. గత వారంలో ఏకంగా దాదాపు 40 వేల బస్తాల ధాన్యం రాగా.. ఈ ఆదివారం కేవలం 5,893 బస్తాల వరి ధాన్యం మాత్రమే వచ్చింది. దీంతో క్వింటాల్ గరిష్టంగా రూ.2,668, కనిష్టంగా రూ.2,658 ధర లభించిందని మార్కెట్ అధికారి రమేష్ తెలిపారు.

లక్ష డప్పులు, వెయ్యి ప్రదర్శనలకు శ్రీకారం

మహబూబ్‌నగర్ రూరల్: మాదిగ జాతిలో పుట్టిన ప్రతిబిడ్డ ఇంటికొక డప్పుతో స్వచ్ఛందంగా తరలివచ్చి జాతి కోసం పని చేయాలని దండోరా కళా మండలి రాష్ట్ర కోఆర్డినేటర్, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఇన్‌చార్జి డాక్టర్ డప్పు స్వామి అన్నారు. లక్షల డప్పుల్ని తరలించే కార్యక్రమంలో భాగంగా.. మహబూబ్‌నగర్ జిల్లా నుంచి ఐదు వేల మంది డప్పు కళాకారులు తరలిరావాలన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ కళాభవన్‌లో జిల్లా కళా నాయకుల కవాత్ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరూ కలిసికట్టుగా హక్కులు సాధించుకోగలమన్నారు. జాతి కోసం, భవిష్యత్ కోసం పార్టీలకతీతంగా అందరూ కలిసిరావాలని పిలుపునిచ్చారు. అనంతరం డప్పు కళాకారుల సంఘం జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఇందులో అధ్యక్షుడిగా రొట్టె శేఖర్, ప్రధాన కార్యదర్శిగా కృష్ణ, ఉపాధ్యక్షులుగా చెన్నయ్య, ప్రవీణ్, ఝాన్సీ, సహాయ కార్యదర్శులుగా వెంకటసాగర్, వెంకటయ్య, ప్రచార కార్యదర్శిగా వెంకటయ్య, సోషల్ మీడియా ఇన్‌చార్జిగా బాలీశ్వరిలను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నాయకులు సంధ్య కార్తీక్, కిరణ్, అంజన్న, జములయ్య, శ్రీరాములు, బాలయ్య, కావలి కృష్ణయ్య, సురేష్, కుర్మయ్య, మైబు, ఎర్ర నర్సింహ, బాలయ్య, ఎదిర నర్సింహ, బాలు పాల్గొన్నారు.

సమగ్రశిక్ష ఉద్యోగుల వినూత్న నిరసన



చీపుర్లతో రోడ్లు ఊడ్చుతున్న సమగ్రశిక్ష ఉద్యోగులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లాకేంద్రంలోని టీటీడీ కల్యాణ మండపం వద్ద సమగ్రశిక్ష ఉద్యోగులు గత 20 రోజులుగా చేస్తున్న నిరసనలో భాగంగా ఆదివారం చీపురులు పట్టి రోడ్లు ఊడ్చి వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల ముందు అప్పటి కాంగ్రెస్ పార్టీ పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి హనుమకొండలో ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. చాలీచాలని వేతనాలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, కనీసం కుటుంబాలను పోషించుకోలేని పరిస్థితిలో ఉన్నామని, ఉద్యోగ భద్రత లేక భయంగా జీవితాలు వెళ్లదీస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తమ తర్వాత విధుల్లో చేరిన రెగ్యులర్ ఉద్యోగుల వేతనాలు పెరగడంతోపాటు ప్రమోషన్‌లు కూడా పొందారని, వారితో సమానంగా పనిచేస్తున్న తమ వేతనాల్లో మాత్రం ఎలాంటి పెరుగుదల లేదని, ఏళ్ల తరబడిగా అరకొర జీతాలతో నెట్టుకొస్తున్నామని వాపోయారు. ఇప్పటికైనా సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే స్పందించి తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, యాదగిరి, చంద్రశేఖర్, మంజుల, హర్షకుమార్ తదితరులు పాల్గొన్నారు.

'రాష్ట్రంలో పరిపాలన గాడి తప్పింది'

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: రాష్ట్రంలో ప్రభుత్వ పాలన గాడి తప్పిందని ఏబీవీపీ రాష్ట్ర ఆల్ యూనివర్సిటీ కోకన్వీనర్ కృష్ణకుమార్ అన్నారు. ఈ మేరకు ఆదివారం పాలమూరు యూనివర్సిటీ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఏ శాఖకు ఏ మంత్రి ఉన్నారో తెలియదని, విద్యాశాఖ మంత్రి ఎవరో తెలియని దుస్థితి దాపురించిందన్నారు. ఫలితంగా ఆయా శాఖల్లో పెండింగ్ ఫైల్స్ పేరుకుపోయాయని, ప్రజలు, ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. ఏడాది పాలనలోనే అన్నివర్గాల ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వంపై అసంతృప్తితో ఉన్నారని, ఇప్పటికైనా ప్రభుత్వం మేలుకుని పరిపాలనపై దృష్టిసారించాలని హితవు పలికారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం తమవంతు పోరాటాలు కొనసాగిస్తామన్నారు. సమావేశంలో నాయకులు వేణుగోపాల్, సంగీత, నాగేష్, రవితేజ తదితరులు పాల్గొన్నారు.

భూమి లేని పేదలకు రూ.12 వేలు ఇవ్వాలి



మాట్లాడుతున్న వెంకట్రాములు

జడ్చర్ల టౌన్: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు భూమి లేని పేదలకు తక్షణమే రూ.12 వేలు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్రాములు అన్నారు. ఆదివారం స్థానిక అంబేడ్కర్ కళాభవన్‌లో నిర్వహించిన వ్యవసాయ కార్మికసంఘం జిల్లా కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికకు యాప్‌లు అవసరం లేదని, ప్రభుత్వం వద్ద ఉన్న డాటా ప్రకారం పేదలందరికీ ఇళ్లు కట్టుకోవడానికి వెంటనే డబ్బులు ఇవ్వాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది అవుతున్నప్పటికీ కూలీలకు డబ్బులు ఇవ్వకపోవడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో అవకతవకలకు తావు లేకుండా అర్హులందరికీ కేటాయించాలన్నారు. లేకపోతే తమ సంఘం ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు జగన్, కార్యదర్శి మోహన్, ఉపాధ్యక్షుడు హన్మంతు, సహాయ కార్యదర్శి పాండు, సభ్యులు శివలీల, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

బోటు షికారు మరింత చేరువ

- సోమశిలలో కొత్తగా ఐదు వాటర్ బోట్లు ఏర్పాటు
- ఇద్దరు నుంచి నలుగురు కృష్ణానదిలో విహరించేందుకు అవకాశం
- త్వరలోనే మంత్రి జూపల్లి కృష్ణారావు చేతులమీదుగా ప్రారంభం

నదిలో రయ్..రయ్



సోమశిల వద్ద కృష్ణానది తీరంలో కొత్తగా ఏర్పాటుచేసిన స్పోర్ట్స్ బోట్లు

కొల్లాపూర్: నదీ ప్రయాణాలు కోరుకునే పర్యాటకులకు ఇది ఉత్సాహం కలిగించే అంశం. సోమశిల వద్ద కృష్ణానదిలో పర్యాటకులు ఒంటరిగా లేదా జంటగా విహరించేందుకు టూరిజం శాఖ కొత్త వాటర్ బోట్లు (స్పోర్ట్స్ బోట్లు) ఏర్పాటు చేసింది. ప్రైవేటు సంస్థకు బోట్ల నిర్వహణ బాధ్యతలను అప్పగించింది. ఇప్పటికే బోటు షికారు ప్రారంభం కావాల్సి ఉండగా.. కొన్ని కారణాల వల్ల వాయిదా పడింది. త్వరలోనే రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు కొత్త బోట్లను ప్రారంభించనున్నారు.

పర్యాటకుల షికారు కోసం..

సోమశిల వద్ద కృష్ణానది అందాలు పర్యాటకులకు కనువిందు చేస్తాయి. ఇక్కడ పర్యాటక శాఖ ఇప్పటికే సోమేశ్వర లాంచీ (మినీ)ని ఏర్పాటుచేసింది. ఇందులో 30 మందికి పైగా ప్రయాణికులు నదిలో విహరించేందుకు వీలుంది. రోజు సోమశిల నుంచి మల్లేశ్వరం ఐలాండ్ వరకు పర్యాటకులను తీసుకువెళ్లి.. వెనక్కి తీసుకువస్తారు. సోమశిల నుంచి శ్రీశైలం వెళ్లేందుకు మరో పెద్ద లాంచీ కూడా అందుబాటులో ఉంది. అయితే ఎక్కువ సంఖ్యలో జనం ఉంటేనే ఈ రెండు బోట్లు నదిలోకి వెళ్తాయి. ఒకరిద్దరు ఉంటే వెళ్లవు. ఈ సమస్యకు పరిష్కారంతోపాటు ఔత్సాహికులకు నదీ షికారును మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో టూరిజం శాఖ చిన్నబోట్ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది.

ఐదు రకాల కొత్త బోట్లు..

ఒకరు లేదా ఇద్దరి నుంచి నలుగురు వరకు ప్రయాణించేలా 5 రకాల కొత్త బోట్లను ఏర్పాటుచేశారు. ఇద్దరు వ్యక్తులు వెళ్లేందుకు వీలుగా స్వాన్, కయాక్, స్కూటీ బోట్లు ఉన్నాయి. నలుగురు వెళ్లేందుకు వీలుగా ఫన్‌యాక్, పెడల్ బోట్లను సోమశిలలో సిద్ధంగా ఉంచారు. ఈ బోట్లను ప్రయాణికులే నడపవచ్చు. లేదంటే ప్రైవేటు సంస్థ ప్రతినిధి సహకారం తీసుకోవచ్చు. ఈ బోట్ల ద్వారా కృష్ణానదిలో విహరించేందుకు ఒక్కో ప్రయాణికుడికి రూ. 200 చొప్పున చార్జీలు వసూలు చేయాలని భావిస్తున్నారు. అయితే దీనిపై ఇంకా స్పష్టమైన ప్రకటన రాలేదు. 15 నిమిషాల షికారుకు ధరను నిర్ణయించనున్నారు. ఎక్కువ సేపు నదిలో విహరిస్తే అదనపు చార్జీలు వసూలు చేయనున్నారు. డిమాండ్ పెరిగితే బోట్ల సంఖ్య పెంచే అవకాశం ఉందని నిర్వహణ సంస్థ ప్రతినిధులు వెల్లడించారు.

పర్యాటకుల సంఖ్య పెంచేలా..

కృష్ణానది అందాలు తిలకించేందుకు పలు ప్రాంతాల నుంచి పర్యాటకులు ఇక్కడికి వస్తుంటారు. కొంతమంది నదిలో స్పోర్ట్స్ బోట్లు ఏర్పాటుచేస్తే బాగుంటుందని మంత్రి జూపల్లి కృష్ణారావు దృష్టికి తీసుకువచ్చారు. మంత్రి సూచన మేరకు స్పోర్ట్స్ బోట్ల ఏర్పాటుకు టూరిజం శాఖ చర్యలు చేపట్టింది. సోమశిల, అమరగిరి, సింగోటం, మల్లేశ్వరం, మంచాలకట్ట ప్రాంతాలకు వచ్చే పర్యాటకుల సంఖ్య పెంచేందుకు, వారికి అవసరమైన వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– నర్సింహ్మ, జిల్లా పర్యాటకశాఖ అధికారి

పెరిగిన రద్దీ..

సోమశిలలో బోటు షికారుకు పర్యాటకులు పెద్ద సంఖ్యలో ఆసక్తి చూపుతున్నారు. సోమేశ్వర లాంచీకి రోజూ ఫుల్ గిరాకీ ఉంటోంది. అదే విధంగా శని, ఆదివారాల్లో మాత్రమే తిరిగే సోమశిల టూ శ్రీశైలం లాంచీ ప్రయాణానికి కూడా ఇటీవల డిమాండ్ పెరిగింది. ప్రతి వారం వంద మంది మేరకు లాంచీలో ప్రయాణాలు సాగిస్తున్నారు. 8 వారాలుగా రెగ్యులర్‌గా లాంచీ ప్రయాణం సాగుతోంది. లాంచీ ప్రయాణాలకు పర్యాటకులు ఆసక్తి చూపుతున్న నేపథ్యంలో కొత్తగా ఏర్పాటుచేస్తున్న స్పోర్ట్స్ బోట్లకు కూడా డిమాండ్ ఉంటుందని పర్యాటక శాఖ అధికారులు భావిస్తున్నారు.



బోటు షికారుకు వెళ్లే వారి కోసం వీఐపీ ఘాట్ వద్ద ఏర్పాట్లు

తుది అంకానికి..



నారాయణపేట - రంగారెడ్డి జిల్లాల మహిళా జట్ల మ్యాచ్

- హోరాహోరీగా రాష్ట్రస్థాయి సీఎం కప్ కబడ్డీ చాంపియన్‌షిప్
- పురుషుల విభాగంలో సెమీస్‌కు నారాయణపేట, వనపర్తి, రంగారెడ్డి, నల్లగొండ జట్లు
- మహిళా విభాగంలో నల్లగొండ, హైదరాబాద్, రంగారెడ్డి, గద్వాల..
- నేటితో ముగియనున్న పోటీలు



గద్వాల-వనపర్తి జిల్లాల పురుషుల జట్ల మ్యాచ్

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి సీఎం కప్ కబడ్డీ చాంపియన్‌షిప్ చివరి దశకు చేరింది. ఆదివారం ప్రీ క్వార్టర్, క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లు జరిగాయి. ఈ మ్యాచ్‌లు హోరాహోరీగా కొనసాగాయి. పురుషుల విభాగంలో నారాయణపేట, వనపర్తి, రంగారెడ్డి, నల్లగొండ జట్లు సెమీ ఫైనల్‌కు చేరాయి. మహిళల విబాగంలో నల్లగొండ, హైదరాబాద్, రంగారెడ్డి, గద్వాల జట్లు సెమీస్‌కు చేరాయి. సోమవారం జరిగే పురుషుల విభాగం సెమీ ఫైనల్‌లో రంగారెడ్డి - నల్లగొండ, నారాయణపేట - వనపర్తి జట్లు, మహిళల సెమీస్‌లో నల్లగొండ - హైదరాబాద్, రంగారెడ్డి - గద్వాల జట్లు తలపడనున్నాయి.

ప్రీ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లు..

పురుషుల విభాగం ప్రీ క్వార్టర్ ఫైనల్ మ్యాచుల్లో రంగారెడ్డి జట్టు 61–31 పాయింట్ల తేడాతో ములుగు జట్టుపై, సిద్దిపేట 31–20 తేడాతో ఆసిఫాబాద్‌పై, హన్మకొండ 31–16 తేడాతో కరీంనగర్‌పై, నల్లగొండ 64–35 తేడాతో కామారెడ్డిపై, కొత్తగూడెం 36–20 తేడాతో మంచిర్యాలపై, నారాయణపేట 54–42 తేడాతో హైదరాబాద్‌పై, వనపర్తి 41–19 తేడాతో మేడ్చల్‌పై, గద్వాల 28–13 తేడాతో నాగర్‌కర్నూల్‌పై విజయం సాధించాయి. మహిళల ప్రీ క్వార్టర్ ఫైనల్ మ్యాచుల్లో నల్లగొండ 43–9 పాయింట్ల తేడాతో సంగారెడ్డిపై, కరీంనగర్ 60–31 తేడాతో భూపాలపల్లిపై, వనపర్తి 36–33 తేడాతో ములుగుపై, హైదరాబాద్ 31–15 తేడాతో మహబూబ్‌నగర్‌పై, రంగారెడ్డి 51–15 తేడాతో జనగాంపై, నారాయణపేట 38–35 తేడాతో కొత్తగూడెంపై, మేడ్చల్ 39–37 తేడాతో నాగర్‌కర్నూల్‌పై, గద్వాల 47–13 తేడాతో మహబూబాబాద్ జట్టుపై గెలుపొందాయి.

క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌ల ఫలితాలు..

పురుషుల విభాగం క్వార్టర్ ఫైనల్‌లో నారాయణపేట జట్టు 47–34 పాయింట్ల తేడాతో కొత్తగూడెం జట్టుపై, వనపర్తి 34–23 తేడాతో గద్వాలపై, నల్లగొండ 45–27 పాయింట్ల తేడాతో హన్మకొండపై, రంగారెడ్డి 43–20 తేడాతో సిద్దిపేట జట్లపై గెలుపొందాయి. అదే విధంగా మహిళా విభాగం క్వార్టర్ ఫైనల్ మ్యాచుల్లో నల్లగొండ 54–15 పాయింట్ల తేడాతో కరీంనగర్‌పై, హైదరాబాద్ 32–18 తేడాతో వనపర్తిపై, రంగారెడ్డి 75–16 తేడాతో నారాయణపేటపై, గద్వాల 39–20 తేడాతో మేడ్చల్‌పై విజయాలు నమోదు చేసుకున్నాయి.

క్రీడాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

రాష్ట్రంలో క్రీడాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేసిందని ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు ఎన్పీ వెంకటేశ్ అన్నారు. రాష్ట్రస్థాయి సీఎం కప్ కబడ్డీ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులను ఆదివారం ఆయన పరిచయం చేసుకొని మ్యాచ్‌లను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. క్రీడాకారుడైన సీఎం రేవంత్‌రెడ్డి క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. గ్రామీణస్థాయి నుంచి క్రీడాకారులను ప్రోత్సహించడానికి సీఎం కప్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. త్వరలో ఏర్పాటు చేయనున్న స్పోర్ట్స్ యూనివర్సిటీతో రాష్ట్ర క్రీడాకారులకు మెరుగైన అవకాశాలు లభిస్తాయన్నారు. అదే విధంగా రాష్ట్ర కబడ్డీ సంఘం మాజీ ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్ యాదవ్ క్రీడా జట్లను పరిచయం చేసుకొని అభినందించారు. కార్యక్రమంలో డీవైఎస్‌ఓ ఎస్.శ్రీనివాస్, పశుసంవర్ధకశాఖ జేడీ మధుసూదన్‌గౌడ్, డీఎంహెచ్‌ఓ కృష్ణ, ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి కురుమూర్తిగౌడ్, జాతీయ కబడ్డీ క్రీడాకారుడు విజయ్‌కుమార్, పాపారాయుడు పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎన్పీ వెంకటేశ్

సీఎం కప్ రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా జట్ల ప్రతిభ



ద్వితీయ బహుమతి అందుకుంటున్న జిల్లా బాలుర హ్యాండ్‌బాల్ జట్టు

మహబూబ్‌నగర్ క్రీడలు: వరంగల్‌లో ఆదివారం ముగిసిన సీఎం కప్ రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో జిల్లా బాలుర జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. ఫైనల్ మ్యాచ్‌లో వరంగల్ జట్టు 44–25 గోల్స్ తేడాతో జిల్లా జట్టుపై విజయం సాధించింది.

రన్నరప్‌గా బాలుర, బాలికల జట్లు



రన్నరప్‌గా నిలిచిన జిల్లా బాల, బాలికల జట్లు

మహబూబ్‌నగర్ క్రీడలు: ఖమ్మంలో ఆదివారం ముగిసిన రాష్ట్రస్థాయి సీఎం కప్ వాలీబాల్ పోటీల్లో మహబూబ్‌నగర్ జిల్లా బాల, బాలికల జట్లు రన్నరప్‌గా నిలిచాయి. బాలుర విభాగం ఫైనల్ మ్యాచ్‌లో వరంగల్ జట్టు 25–22, 25– 23, 25– 14 సెట్ల తేడాతో జిల్లా జట్టుపై, బాలికల ఫైనల్‌లో నిజామాబాద్ జట్టు 25– 21, 25– 15, 23– 25, 25– 17 సెట్ల తేడాతో జిల్లా జట్టుపై గెలుపొందాయి.

అత్యపత్య పోటీల్లో..

మహబూబ్‌నగర్ క్రీడలు: హైదరాబాద్‌లోని సరూర్ నగర్ స్టేడియంలో ఆదివారం ముగిసిన రాష్ట్రస్థాయి సీఎం కప్ అత్యపత్య పోటీల్లో జిల్లా బాలుర జట్టు రన్నరప్‌గా నిలిచింది. ఫైనల్ మ్యాచ్‌లో హైదరాబాద్ జట్టు 29– 19 పాయింట్ల తేడాతో మహబూబ్‌నగర్ జట్టుపై విజయం సాధించింది.



రన్నరప్‌గా నిలిచిన జిల్లా బాలుర జట్టు

క్లుప్తంగా

ఉరేసుకుని డిగ్రీ విద్యార్థిని ఆత్మహత్య



అంకిత (ఫైల్)

నవాబుపేట: ఉరేసుకుని డిగ్రీ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన నవాబుపేట మండలం కాకర్లపహాడ్‌లో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. కాకర్లపహాడ్‌కు చాకలి అంకిత (18) జిల్లా కేంద్రంలో డిగ్రీ చదువుతుంది. ఆమె తల్లిదండ్రులు సుజాత - ఆంజనేయులు పర్వతాపూర్ మైసమ్మ ఆలయంలో ఆది, మంగళవారాల్లో పనులు చేస్తుంటారు. ఎప్పటి మాదిరిగానే వారు గుడికి వెళ్లి సాయంత్రం ఇంటికి వచ్చే వరకు అంకిత ఉరేసుకుని కనిపించింది. గ్రామస్తుల సహాయంతో ఆమెను జిల్లా ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కాగా, విద్యార్థిని అంకిత ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

మరో వ్యక్తి..

తెలకపల్లి: ఒంటరితనం భరించలేక ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండల కేంద్రంలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ నరేష్ వివరాల మేరకు.. తెలకపల్లికి చెందిన రెడ్డపాకుల నిరంజన్ (50), అతడి భార్య అలివేల మధ్య గొడవలు చోటు చేసుకోవడంతో మహబూబ్‌నగర్‌లో ఉంటుంది. 15 ఏళ్లుగా నిరంజన్ ఒంటరిగా జీవిస్తూ తాగుడుకు బానిసయ్యాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తిచెంది ఇంట్లోనే ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి సోదరి నోముల రేవతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా మార్చురీకి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి దుర్మరణం

ఉండవెల్లి: మండలంలోని 44వ నంబర్ జాతీయ రహదారిపై గుర్తుతెలియని వ్యక్తి దుర్మరణం చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. ఉండవెల్లి గ్రామ శివారులోని రైల్వే హైలెవల్ బ్రిడ్జిపై నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తిని గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో అతడికి తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహంపై నుంచి వాహనాలు వెళ్లడంతో నుజ్జునుజ్జయ్యింది. గమనించిన హైవే సిబ్బంది పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని అలంపూర్ మార్చురీకి తరలించారు. మృతుడి వయసు 35నుంచి 40 ఏళ్లు ఉంటుందని.. ఆరెంజ్ కలర్ టీషర్ట్, బూడిద రంగు పాయింటు ధరించినట్లు ఏఎస్‌ఐ సుబ్బారెడ్డి తెలిపారు. హైవే పెట్రోలింగ్ అధికారి తిక్కయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పేర్కొన్నారు.

చికిత్సపొందుతూ వృద్ధురాలు మృతి



బాలకిష్టమ్మ (ఫైల్)

నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లా జనరల్ ఆస్పత్రిలో ఆదివారం చికిత్స పొందుతూ ఓ వృద్ధురాలు మృతిచెందగా వైద్యుల నిర్లక్ష్యంతోనే చనిపోయిందని బాధిత కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. వారి కథనం మేరకు.. మండలంలోని ఔరాసిపల్లికి చెందిన బాలకిష్టమ్మ (65) అనారోగ్యంతో ఈ నెల 27న జిల్లాకేంద్రంలోని జనరల్ ఆస్పత్రిలో చేరింది. చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందగా సకాలంలో ఆక్సిజన్ అందించకపోవడంతోనే చనిపోయినట్లు కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ఘటనకు సంబంధించి ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.రఘును వివరణ కోరగా వృద్ధురాలు అధిక రక్తపోటుతో ఆస్పత్రికి రాగా వెంటిలేటర్‌పై చికిత్స అందించామని.. ఆమె మృతికి వైద్యుల నిర్లక్ష్యం కాదని వివరించారు.

షార్ట్‌సర్క్యూట్‌తో గుడిసె దగ్ధం



కల్వకుర్తి రూరల్: మండలంలోని తర్నికల్‌తండాలో ఆదివారం షార్ట్‌సర్క్యూట్‌తో తండాకు చెందిన సీథ్యా గుడిసె దగ్ధమైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన సీథ్యా తన పొలంలో వ్యవసాయ పనులు చేసుకుంటున్నాడు. అదే సమయంలో తను నివాసం ఉండే గుడిసె నుంచి పొగలు రావడంతో చుట్టుపక్కల వారు మంటలను ఆర్పేందుకు ప్రయత్నించడంతో పాటు బాధితుడికి, ఫైర్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. ఫైర్ సిబ్బంది ఘటన స్థలానికి వచ్చి మంటలను పూర్తిగా ఆర్పివేశారు. అప్పటికే గుడిసెలో ఉన్న ధాన్యం, బియ్యం, బట్టలు, భూమికి సంబంధించిన పట్టా కాగితాలు, ఇతర సర్టిఫికెట్లు కాలిపోయాయని బాధితుడు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం తనని ఆదుకోవాలని వేడుకుంటున్నాడు.

వాహనాల దొంగలు అరెస్ట్



పోలీసులు స్వాధీనం చేసుకున్న బైకులు

- హైదరాబాద్‌లో చోరీ.. నిడ్జింతలో అమ్మకం
- 25 ద్విచక్రవాహనాలు స్వాధీనం

కొత్తపల్లి: హైదరాబాద్‌లో పార్కింగ్‌లో ఉంచిన వాహనాలను చోరీ చేస్తూ నిడ్జింతలో అమ్ముతున్న దొంగలను అరెస్ట్‌చేసినట్లు రాచకొండ క్రైం బ్రాంచ్ సీఐ గురుప్రసాద్ తెలిపారు. వివరాలు.. హైదరాబాద్‌కు చెందిన ఓవ్యక్తి అక్కడ పార్కింగ్‌లో ఉన్న వాహనాలను చోరీచేస్తాడు. వాటిని నారాయణపేట జిల్లా కొత్తపల్లి మండలంలోని నిడ్జింత గ్రామానికి చెందిన తన స్నేహితుడు రాజుకి అప్పగిస్తాడు. అతడు వాటిని అమ్మగా వచ్చిన డబ్బులను ఇద్దరు కలిసి పంచుకుంటారు. రెండేళ్లుగా ఇదే తంతు కొనసాగుతోంది. రాచకొండ కమిషనరేట్ పరిధిలోని చైతన్యపురి పోలీస్‌స్టేషన్‌లో ఆరు నెలల క్రితం ఓ బుల్లెట్ వాహనం చోరీకి గురికాగా బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రాచకొండ క్రైం బ్రాంచ్ సీఐ గురుప్రసాద్ దర్యాప్తు ప్రారంభించారు. బైక్ నంబర్లు, కలర్ ఆధారంగా సీసీ కెమెరాల్లో నిక్షిప్తమైన సమాచారంతో హైదరాబాద్‌లో దొంగను పట్టుకున్నారు. దొంగలించిన బుల్లెట్ బైక్ ఏదీ అని పోలీసులు ప్రశ్నించగా కొత్తపల్లి మండలంలోని నిడ్జింత గ్రామంలోని తన స్నేహితుడు రాజుకు అప్పగించినట్లు తెలిపాడు. ఇవే కాక మరో 25బైక్‌లను కూడా చోరీ చేసినట్లు ఒప్పుకున్నాడు. దొంగలించిన బైక్‌లను ఎవరెవరికి అమ్మిన విషయాన్ని పోలీసులకు తెలిపారు. దీంతో దొంగతో పాటు పోలీసులు ఆదివారం నిడ్జింతకు చేరుకొని బైక్‌లను స్వాధీనం చేసుకొని రాజును కూడా అరెస్ట్‌చేసి హైదరాబాద్‌కు తరలించారు. ఈ దొంగకు, రాజుకు హైదరాబాద్‌లోని ఓ పాఠశాలలో చదువుకుంటున్న సమయంలో పరిచయమైనట్లు సీఐ తెలిపారు.

బ్యాగు అపహరించిన వ్యక్తికి రిమాండ్



నిందితుడితో పాటు స్వాధీనం చేసుకున్న నగదును చూపుతున్న సీఐ ఆదిరెడ్డి

రూ.70 వేలు స్వాధీనం

జడ్చర్ల: స్థానిక కొత్త బస్టాండ్‌లో ఆదివారం ఓ ప్రయాణికుడి బ్యాగును అపహరించిన వ్యక్తిని సీసీ ఫుటేజీల ఆధారంగా కొన్ని గంటల్లోనే గుర్తించి అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ ఆదిరెడ్డి తెలిపారు. ఆయన కథనం మేరకు.. జోగుళాంబ గద్వాల జిల్లా గట్టు మండలం మాచర్లకు చెందిన పెద్దింటి సుదర్శన్ హైదరాబాద్ నుంచి సొంత ఊరికి ఆర్టీసీ బస్సులో బయలుదేరారు. భోజన విరామ సమయంలో జడ్చర్ల బస్టాండ్‌లో బస్సు ఆగగా తన దగ్గర ఉన్న బ్యాగును సీటుపై ఉంచి భోజనానికి వెళ్లాడు. తిరిగి వచ్చేసరికి సీటులో బ్యాగు కనిపించకపోవడంతో వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. బ్యాగులో రూ.70 వేల నగదు కూడా ఉన్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు బస్టాండ్‌లోని సీసీ ఫుటేజీల ఆధారంగా కావేరమ్మపేటకు చెందిన అబ్దుల్ అబ్బాస్‌గా గుర్తించి అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు. నిందితుడి వద్ద మరో రెండు బ్యాగులను కూడా గుర్తించి స్వాధీనం చేసుకున్నాని.. నిందితుడిపై పలు దొంగతనాల కేసులుండగా జైలుకు కూడా వెళ్లి వచ్చారని సీఐ వివరించారు. సమావేశంలో ఎస్‌ఐ శివానందంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గుట్టుగా గుట్కా అమ్మకాలు



పట్టుబడ్డ గుట్కా ప్యాకెట్లు (ఫైల్)

కల్వకుర్తి రూరల్: పట్టణంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో గుట్కా అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. యువత చెడు అలవాట్లకు బానిసలు కాకుండా చేసేందుకు ప్రభుత్వం గుట్కా, ఖైనీ తదితర పదార్థాలపై నిషేధం విధించినా.. క్షేత్రస్థాయిలో అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా బహిరంగ మార్కెట్లో గుట్కాలు విచ్చలవిడిగా దొరుకుతున్నాయి. గుట్కాలు తినే వారు క్యాన్సర్ లాంటి ప్రమాదభరిత రోగాల బారిన పడి ప్రాణాలు కోల్పోతున్న ఘటనలు ఉన్నాయి. అయితే కొంతమంది వ్యాపారులు ధనార్జనే ధ్యేయంగా గుట్కా అమ్మకాలను కొనసాగిస్తుండగా.. పోలీసులు అడపదడపా దాడులు చేస్తూ చేతులు దులుపుకుంటున్నారు. డిసెంబర్ 11వ తేదీన పోలీసులను చూసి వెనక్కి వెళ్తున్న ఆటోను వెంబడించి తనిఖీలు చేయగా దాదాపు రూ.2 లక్షల విలువైన గుట్కా ప్యాకెట్లు పట్టుబడ్డాయి. ఇది ఇలా ఉంటే వ్యాపారులు తమ వద్దకు వచ్చే రెగ్యులర్ కస్టమర్లకు మాత్రమే గుట్టుగా గుట్కాలను అమ్ముతున్నారు. హోల్‌సేల్‌గా రూ.2 నుంచి రూ.30 లకు పాకెట్ గుట్కాను అమ్ముతుండగా రిటైల్ మార్కెట్‌లో రూ.30 నుంచి రూ.50 వరకు తీసుకుంటున్నట్లు సమాచారం. మరి కొన్ని పాన్ షాపుల్లో గంజాయి విక్రయాలు కొనసాగుతున్నాయి. ప్రభుత్వం, పోలీసులు గుట్కా అమ్మే వారిపై కఠిన చర్యలు తీసుకొని, విక్రయాలకు అడ్డుకట్ట వేయాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయంపై పోలీసులను వివరణ కోరగా దాడులు చేస్తామన్నారు.

నాలుగు చోరీ కేసుల్లో నిందితులకు రిమాండ్



వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర రావు, సీఐ, ఎస్‌ఐలు

వనపర్తి: ఇటీవల జిల్లాలో చోటు చేసుకున్న నాలుగు చోరీ కేసులు ఛేదించి నిందితులను రిమాండ్‌కు తరలించడంతో పాటు సొమ్ము జప్తు చేసినట్లు డీఎస్పీ వెంకటేశ్వరరావు వెల్లడించారు. ఆదివారం సాయంత్రం ఆయన ఎస్పీ కార్యాలయంలో ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఈ నెల 24వ తేదీ తెల్లవారుజామున ఖిల్లాఘనపురం మండల కేంద్రంలోని ఓ బంగారం ఆభరణాలు తయారు చేసే షాపులో చోరీకి పాల్పడిన బంగారం, వెండి వస్తువులను అపహరించుకుపోయిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నామన్నారు. సెప్టెంబర్‌లో ఖిల్లాఘనపురంలోని ఆంజనేయస్వామి ఆలయంలో చోరీకి పాల్పడింది కూడా తానేనని నిందితుడు ఒప్పుకున్నట్లు తెలిపారు. దీంతో పాటు ఈనెల 28వ తేదీ శనివారం పెబ్బేరు సంతలో రెండు మొబైల్ ఫోన్లు, ఒక ఆటోను చోరీ చేసిన నలుగురు నిందితులను ఆదివారం ఉదయం అదుపులోకి తీసుకుని విచారించగా.. వారు చోరీ చేసేందుకు పెబ్బేరుకు వచ్చినట్లు చెప్పారని, రద్దీగా ఉండే పెబ్బేరు సంత ప్రదేశాన్ని లక్ష్యంగా చోరీలు పాల్పడతామని తెలిపారన్నారు. గోపాల్‌పేట మండలం ఏదుట్లలో, పెద్దమందడి మండలంలో నవంబర్‌లో పందులను అపహరించిన కేసులోనూ.. దర్యాప్తు ముమ్మరం చేసి నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు డీఎస్పీ వెల్లడించారు. నిందితులను రిమాండ్ తరలించినట్లు తెలిపారు. సమావేశంలో కొత్తకోట సీఐ రాంబాబు, ఎస్‌ఐలు తదితరులు పాల్గొన్నారు.

పంప్‌మోడ్ పద్ధతిలో 9,969 క్యూసెక్కులు తరలింపు

దోమలపెంట: భూగర్భ కేంద్రంలో పంప్‌మోడ్ పద్ధతిలో 24గంటల వ్యవధిలో శ్రీశైలం ఆనకట్ట దిగువన సాగర్ జలాశయం నుంచి ఆనకట్ట ఎగువన శ్రీశైలం జలాశయంలోకి 9,969 క్యూసెక్కుల నీటిని (ఎత్తిపోతల) తరలించారు. పోతిరెడ్డిపాడు ద్వారా 1,500 క్యూసెక్కులు, ముచ్చుమర్రి, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్‌కు 1,631, ముచ్చుమర్రి నుంచి కేసీ కెనాల్‌కు 490, రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్‌ఐకు 2,400 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఆదివారం శ్రీశైలం జలాశయంలో నీటిమట్టం 862.0అడుగుల వద్ద 112.2100టీఎంసీల నీటి నిల్వ ఉంది.

రామన్‌పాడులో 1,020 అడుగుల నీటిమట్టం

మదనాపురం: మండలంలోని రామన్‌పాడులో ఆదివారం పూర్తిస్థాయి నీటిమట్టం 1,020అడుగులకు వచ్చి చేరింది. జూరాల ఎడమ కాల్వ 200క్యూసెక్కులు సమాంతర కాల్వ ద్వారా వచ్చే నీటిని నిలిపేశారు. ఎన్టీఆర్ కాల్వ ద్వారా 180క్యూసెక్కులు కుడి, ఎడమ కాల్వ ద్వారా 20 క్యూసెక్కులు తాగునీటి అవసరాల కోసం 20క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నట్లు ఏఈ వరప్రసాద్ తెలి పారు.

తిరుపతితో ప్రత్యేక అనుబంధం



మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

గద్వాల: తిరుమల తిరుపతితో తెలంగాణ ప్రజలకు ప్రత్యేక అనుబంధం ఉందని బ్రహ్మోత్సవాల సమయంలో ప్రత్యేకంగా మగ్గం తయారు చేసిన పట్టుపంచ, పట్టుచీరను సమర్పించడం కొన్ని దశాబ్దాల నుంచి ఆనవాయితీగా వస్తుందని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఆదివారం గద్వాలకు వచ్చిన ఆయన ముందుగా జమ్ములమ్మ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బీఆర్‌ఎస్ నాయకుడు బాసు హనుమంతు ఇంట్లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. తిరుపతికి వెళ్లే రాష్ట్ర భక్తులకు ఈప్రాంత నాయకుల సిఫారసు లేఖలను స్వీకరించి దర్శన అవకాశాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో బాసు హనుమంతు, బాసు శ్యామల, మోనేష్, ఎస్ రాము, రవిప్రకాష్‌గౌడ్, తిరుమలేష్, రాజు, వీరేష్, చంద్రన్నగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వెయ్యేళ్ల నాటి సిద్ధివినాయక విగ్రహాన్ని కాపాడుకోవాలి



సిద్ధివినాయక విగ్రహాన్ని పరిశీలిస్తున్న ఈమని శివనాగిరెడ్డి తదితరులు

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని వ్యవసాయ పొలాల్లో ఉన్న వెయ్యేళ్ల నాటి సిద్ధి వినాయక విగ్రహాన్ని కాపాడుకోవాలని పురావస్తు పరిశోధకులు, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈఓ డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి అన్నారు. గ్రామాల్లో వారసత్వ సంపదను గుర్తించి స్థానికులకు అవగాహన కల్పించి పరిరక్షించేందుకు దోహదపడే 'ప్రిజర్వ్ హెరిటేజ్ ఫర్ పోస్టేరిటి' కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఆయన ఖిల్లాఘనపురంలో పర్యటించారు. ఈ క్రమంలో గ్రామానికి పశ్చిమం వైపు వ్యవసాయ పొలాల్లో ఓ గుండుకు ఉన్న సిద్ధి వినాయక విగ్రహాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు వెయ్యేళ్ల నాటి సిద్ధివినాయక విగ్రహాన్ని గుర్తించామన్నారు. గ్రామానికి మూడు కిలోమీటర్ల దూరంలో ఓ గుండుకు ఎంతో చక్కగా 6 అంగుళాల మందం ఐదు అడుగుల ఎత్తు, నాలుగు అడుగుల వెడల్పులో మలిచిన సిద్ధి వినాయక విగ్రహం ఉందన్నారు. ఎంతో పెద్దదైన ఈ గణపతి విగ్రహం క్రీ.శ. 11వ శతాబ్దం నాటిది అన్నారు. కందూరు చోళుల తొలికాలపు ప్రతిమ లక్షణాలు తెలియజేస్తున్నాయన్నారు. ఆయన వెంట వనపర్తి జిల్లా విశ్వహిందూ పరిషత్ సేవా ప్రముఖ్ బెప్త శ్రీనివాసులు, ఆగారం ప్రకాష్, ఆగారం శేఖర్ రెడ్డి, ఎండీ పాష, నేచర్ అండ్ ఇండియా కల్చర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు పట్నం కృష్ణరాజు తదితరులు ఉన్నారు.

రూ.2 లక్షలు కాజేసిన సైబర్ నేరగాళ్లు

మహబూబ్‌నగర్ క్రైం: క్రెడిట్ కార్డులో హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీ కోసం ప్రతినెలా కట్ అవుతున్న డబ్బులను డీయాక్టివేట్ చేస్తామని చెప్పి సాఫ్ట్‌వేర్ ఉద్యోగి నుంచి డబ్బులు కాజేశారు సైబర్ నేరగాళ్లు. టూటౌన్ సీఐ ఇజాజుద్దీన్ కథనం ప్రకారం.. జిల్లా కేంద్రంలోని రాజేంద్రనగర్ ఏరియాకు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి కొన్ని రోజులుగా క్రెడిట్ కార్డు వాడుతున్నారు. అయితే క్రెడిట్ కార్డుపై అతను కుటుంబానికి సంబంధించి ప్రతినెలా హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీ కోసం రూ. 8,100 కట్ అయ్యే విధంగా ఏర్పాటు చేసుకున్నాడు. ఈ క్రమంలో దీన్ని డీయాక్టివేట్ చేస్తామని ఈ నెల 27న సైబర్ నేరగాళ్లు ఫోన్ చేసి, యాప్ ద్వారా లింక్ పంపించారు. అతను ఏపీకే ఫైల్‌పై క్లిక్ చేసి దాన్ని డౌన్‌లోడ్ చేసిన కొంత సమయానికి అతడి బ్యాంకు ఖాతాలో నుంచి రూ. 2లక్షలు మాయం చేశారు. దీనిపై బాధితుడు ఈ నెల 28న ఫిర్యాదు చేయగా.. రూ. 1.70 లక్షలను ఫ్రీజ్ చేసినట్లు సీఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

నగదు తస్కరించిన మహిళ అరెస్టు..

గద్వాల క్రైం: బ్యాంకు నుంచి నగదు డ్రా చేసుకుని వెళ్తున్న మహిళ బ్యాగ్‌ను తస్కరించిన ఓ మహిళను అరెస్టు చేసి, రూ. లక్ష రికవరీ చేసినట్లు పట్టణ ఎస్‌ఐ కళ్యాణ్‌కుమార్ తెలిపారు. రెండు రోజుల క్రితం గద్వాల పట్టణానికి చెందిన కుర్వ కిష్టమ్మ బ్యాంకులో రూ. లక్ష నగదు కుటుంబ అవసరాల నిమిత్తం డ్రా చేసుకుంది. అక్కడి నుంచి మెడికల్ దుకాణంలో మందులు కొనేందుకు వెళ్లగా.. సంగాల గ్రామానికి చెందిన రావేలమ్మ నగదు ఉన్న బ్యాగ్‌ను అపహరించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని సీసీ కెమెరాల ఆధారంగా నిందితురాలను గుర్తించినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఆదివారం సాయంత్రం కొత్త బస్టాండ్ వద్ద సంచరిస్తున్న నిందితురాలిని పోలీసు సిబ్బంది గుర్తించి అదుపులోకి తీసుకున్నారని.. ఆమె నుంచి రూ. లక్ష రికవరీ చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.